# విజ్ఞాపన పత్రం

తమ నియోజకవర్గ ఎమ్మెల్యే గారు ఊళ్లో ఉన్నారని తెలియగానే ఆయనింటి వద్ద క్యూకట్టేరు అక్కడి ప్రజలు. ప్రతి వ్యక్తి చేతిలో ఒక్కొక్క విజ్ఞాపన పత్రం.

మంచినీళ్ల బావులు - బోరులు, చెరువుల మరమ్మతులు, తెల్ల రేషన్ కార్డులు, వీధుల్లోని మురికి గుంటలు పూడ్చడం, వెలగని వీధి దీపాలు, బలహీన వర్గాలకు పక్కాయిళ్లు, పిల్లలకు కాన్వెంట్లలో ఎడ్మిషన్లు -

ఎమ్మెల్యేగారు ఒక్కొక్క విజ్ఞాపన పత్రాన్ని స్వీకరించి, "వీరి కోరిక పరిశీలించ వలసింది" అని ఒకే ఒక ముక్కరాసి, దిగువ సంతకం చేసి, తన పి.ఏ చేత రబ్బర్‌స్టాంపు వేయించి ఇస్తున్నారు. ఆ - కాయితాలు పట్టుకుని సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రజలు పరిభ్రమిస్తూంటారు.

తమ బుజ్జిబాబుకి ఒక ప్రఖ్యాత కాన్వెంటులో ఎడ్మిషన్‌కి అప్లికేషన్ తీసుకుని, కాన్వెంట్ హెడ్ మిస్ట్రెస్‌ని కలవడానికి వెళ్లేడు అనిరుద్ధరావు. ద్వారం దగ్గర 'కుముద్వతి - హెచ్.ఎం' అని బోర్డు వుంది.

కుముద్వతి - ఎంత చక్కని పేరు! శ్రీరాముని కోడలు - కుశుని భార్య

అనిరుద్ధరావు - తను భాషాప్రవీణ చదివిన రోజుల్లో కుముద్వతి ఎవరో తెలుసుకున్నాడు. బాపూ గీసిన 'తెలుగింటి ఆడపడుచు' బొమ్మలా హెచ్.ఎమ్. కుముద్వతి వుంటుందనుకున్నాడు.

అనిరుద్ధరావుని లోనికి రమ్మంది హెచ్.ఎం. కుముద్వతి.

ఆఫీసు రూములో దూరిన అనిరుద్ధరావు, కుముద్వతిని చూసి ఆశ్చర్యపోయాడు!

జీన్స్‌పాంటు, షర్టు, బాబ్డ్ హెయిర్! హర హరా! ఈవిడా కుముద్వతి?

ఎమ్మెల్యేగారిచ్చిన సిఫార్స్ ఉత్తరాన్ని అందించాడు అనిరుద్ధరావు. ఎల్‌కేజీ బాబుని చూసింది కుముద్వతి.

"మీరేం చేస్తూంటారు?" అనిరుద్ధరావుని ప్రశ్నించింది కుముద్వతి.

"నేను తెలుగు మేస్టర్నండీ!"

"మీరు తెలుగు మేస్టరయ్యుండి మీ బాబుని ఇంగ్లీష్ కాన్వెంట్‌లో వేయబోవడానిక్కారణం?"

"ఇది కంప్యూటర్ యుగం కదండీ! ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అని, ఇంటర్నెట్ అని ఏవేవో ఆధునిక యంత్రాలు వచ్చేశాయి. కాలాన్ననుసరించి మనం కూడా మారాలి కదండీ!" అన్నాడు అనిరుద్ధరావు.

"సరే మీరు వెళ్లొచ్చు. ఓ పదిరోజులు పోయాక, సీటొచ్చిన పిల్లల పేర్లు నోటీస్‌బోర్డు మీద అంటిస్తాం. అప్పుడు చూసుకోండి." అనిరుద్ధరావు చేతులు జోడిస్తూ సెలవు తీసుకున్నాడు.

పదిరోజులు పోయేక అనిరుద్ధరావు నోటీసుబోర్డు చూశాడు. వాళ్ల బుజ్జిబాబు పేరు అందులో లేదు!

ఎమ్మెల్యేగారి సిఫార్స్ వట్టి 'ఫార్స్' గా మారిందా? లక్షమంది నియోజకవర్గ ప్రజలకు ఇదెంతవమానం? అసలా ఎమ్మెల్యేగారికి ఇదెంతవమానం? ఇది ఎమ్మెల్యేగారి దృష్టికి తేక తప్పదు! ఆయనకి తెలిసిందంటే, ఈ హెచ్‌ఎమ్‌ని, స్కూల్‌ని లేపేస్తారు.

అనిరుద్ధరావు - కుముద్వతి గారి మీద మండి పడ్డాడు.

"మా ఎమ్మెల్యేగారి సంగతి మీకింతా తెలిసినట్టు లేదు. ఖబడ్దార్!" అన్నాడు రుసరుసలాడుతూ.

"అయ్యా తెలుగు పండితుడు గారూ! ప్రతి పురుషుని విజయం వెనుకా ఒక స్త్రీ వుంటుందని మీకు తెలుసా?"

"తెలుసు! అయితే ఏంటంటా?"

"ఆ.. ఏంలేదు. మీ ఎమ్మెల్యేగారి విజయం వెనుక ఉన్నది నేనే!" అంది కుముద్వతి